ఇంటింటికీ రేషన్‌కు మంగళం!

- జూన్ 1 నుంచి రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ
- లబ్ధిదారులకు మళ్లీ మొదలు కానున్న కష్టాలు
- పనులు మానుకొని డిపోల చుట్టూ ప్రదక్షిణలే..

పూసపాటిరేగ : ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. ఇంతలోనే గత ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మంగళం పాడుతోంది. వారం రోజులు క్రితం హేతుబద్ధీకరణ పేరిట రైతు సేవా కేంద్రాల కుదింపు, సచివాలయాల్లో ఉద్యోగులు కుదింపు, పాఠశాలలు విలీనాలు ఇలా చూసుకుంటూ పోతే తమ మార్కు రాజకీయం కోసం ప్రజలకు ఇబ్బందులు తెచ్చే పాలనను సాగిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 1వ తేదీ నుండి మొబైల్ వాహనాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో రేషను షాపులలో లబ్ధిదారులకు సరుకులు ఇవ్వనున్నారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ ఇవ్వనున్నట్టు ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో వున్న వాలంటీరు వ్యవస్థను రద్దు చేసి ప్రజలను కొంత మేర ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం తాజాగా ఇంటింటికీ రేషన్‌కు మంగళం పాడటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 163 రేషన్ షాపుల పరిధిలో 57 రేషన్ వాహనాల ద్వారా 84,431 కార్డులకు సరుకులు అందజేసేవారు. ఇప్పుడు పరిస్థితి చూస్తే అయోమయంగా మారింది. ఒక్కో రేషను వాహనానికి నెలకు రూ.21 వేలు చొప్పున ప్రభుత్వం నుంచి అందజేసేవారు. రేషన్ వాహనాలకు 2027 వరకు ఒప్పందం అమలులో వున్నప్పటికీ కూటమి ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి ఇంటింటికీ రేషను పంపిణీకి గుడ్‌బై చెప్పింది. ఈ నిర్ణయంతో నియోజకవర్గంలో 114 మంది ఆపరేటర్లు ఉపాధిని కోల్పోనున్నారు.


డెంకాడ గ్రామంలో సరుకులు అందజేస్తున్న రేషన్ వాహనం(ఫైల్)

నెల్లిమర్ల నియోజకవర్గంలో మండలాల వారీగా సమాచారం			
మండలం	రేషన్ వాహనాలు	రేషన్ దుకాణాలు	రేషన్ కార్డుదారులు
పూసపాటిరేగ	16	47	24,009
నెల్లిమర్ల	20	42	24,213
డెంకాడ	10	42	17,865
భోగాపురం	11	32	18,344

రద్దు చేయడం సరికాదు

గత ప్రభుత్వంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీని కొనసాగించాలి. ప్రభుత్వమే ఇంటింటికీ రేషను అందే విధంగా చూడాలి. గతంలో మారుమూల వున్న ఇళ్లకు సైతం రేషన్ అందించేవారు. నేటి పరిస్థితి చూస్తే అయోమయంగా మారింది.

– పి.భాస్కరరావు,లబ్ధిదారు పతివాడ

ఇంటి వద్దే సరుకులివ్వాలి

రేషన్ వాహనాలను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఈ వాహనాల రద్దుపై ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంటింటికీ సరుకులు ఇవ్వాలి.

– ఎస్.గౌరి, లబ్ధిదారు, పూసపాటిరేగ

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పతివాడ


పతివాడ సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ ప్రస్తుతం మండల వైస్ ఎంపీపీగా సేవలందిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి తనను పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సూచనలు, సలహాలతో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


క్షేత్ర స్థాయి పర్యటనలో కమిషనర్

విజయనగరం: వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం సూచించారు. రాగల 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో శిథిల భవనాల సమీపంలో, పెద్ద వృక్షాల సమీపంలో ప్రజలు ఉండరాదని తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనితీరును పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై మరింత దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి పారిశుధ్యం, ఆహారం పట్ల ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

విత్తనాల గొడౌన్ పరిశీలన


విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజన్, తదితరులు

బొండపల్లి: మండలంలోని నెలివాడలో గల ఏపీ సీడ్స్ వరి విత్తనాల గొడౌన్‌ను వ్యవసాయ శాఖ గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌లోని ఐదు చోట్ల శాంపిల్స్ సేకరించారు. వీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఏడీఏ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన విత్తనాలకు అన్ని పరీక్షలు నిర్వహించామని అధికారులు ఏడీఏ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఏడీఏ స్పందిస్తూ మరోసారి పరీక్షలు నిర్వహించిన తర్వాత రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

గాలికి ఎగిరిపోయిన పైకప్పు


రేకు పడిపోవడంతో ఖాళీ అయిన పైకప్పు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్‌లో మూడో లైన్ నిర్మాణంతో పాటు స్టేషన్ ఆధునీకరణలో భాగంగా కొద్ది రోజుల కిందట ప్లాట్ ఫారం నంబర్ 3లో కొత్తగా వేసిన రేకులు బుధవారం తెల్లవారుజామున వీచిన గాలికి ఎగిరిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్‌లో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని పలువురు అభిప్రాయపడ్డారు.

అర్హులకు గుర్తింపు కార్డులు

గుర్ల: అర్హులైన కౌలు రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) అందజేయనున్నట్లు గుర్ల వీఆర్‌ఓ కె. వెంకటరమణ, వీఏఏ కృష్ణారావు తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించి, గుర్తింపు కార్డులు పొందడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకంతో పాటు బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తామన్నారు .

ప్రకృతి సోయగం


అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ప్రకృతి మనోహరంగా చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. బుధవారం ఉదయం వర్షం కురిసిన అనంతరం డెంకాడ మండలం గుణుపూరుపేట వద్ద ఉన్న కొండపై మేఘాలు ఇలా చూపరులకు కనువిందు చేశాయి. – డెంకాడ

యోగాపై అవగాహన ర్యాలీ


మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఉల్లాసంగా ఉంచే చక్కటి ప్రక్రియ యోగా అని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయనగరంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద యోగాసనాలు వేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడికి దూరం కావాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, నగర పాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. – విజయనగరం

క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (మేల్) 12 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి సచివాలయాలు కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ సేవలు బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా హెల్త్ అసిస్టెంట్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. సీజనల్‌గా ప్రబలే అంటువ్యాధులను గుర్తించి పీహెచ్‌సీ వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంవో వై.మణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

విజయనగరం అర్బన్: మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు జయంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తెలుగు జాతికి గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన మహనీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగుజాతి గొప్పదనాన్ని, గౌరవాన్ని ప్రపంచ స్థాయికి చేర్చిన వ్యక్తి అని అన్నారు. సినీరంగంలో విశ్వఖ్యాతి గడించడమే కాకుండా రాజకీయ రంగంపై చెరగని ముద్ర వేశారని చెప్పారు. కరణం, మున్సిబు వ్యవస్థను రద్దు చేయడం లాంటి విప్లవాత్మక సంస్కరణలు సమాజంలో సమూల మార్పులకు నాంది పలికాయని అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ గొప్ప నటుడే కాకుండా గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తొలిత మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థినిలు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ రంగస్థల నటులు కందుల గుణేశ్వరరావు శ్రీకృష్ణుడిగా ప్రదర్శించిన రాయబారం ఘటం, నంది అవార్డు గ్రహీత ముల్లపూడి రామచంద్రరావు దుర్యోధనుడుగా ప్రదర్శించిన మయసభ ఘట్టం ఏకపాత్రాభినయాలు ప్రేక్షకులకు ఉర్రూతలూగించాయి. నంది అవార్డు గ్రహీత మురళి హార్మోనియంపై వాద్య సహకారాన్ని అందించారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌వో మురళీ, సీపీవో పి.బాలాజీ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.వెంకటేష్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విద్యార్థులకు అభినందనలు

విజయనగరం అర్బన్: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో పని చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 16 మంది విద్యార్థులకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు అభినందించారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసాపత్రాలు, మెమోంటో అందజేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లను కూడా అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు టి.జయశ్రీ, రాణిశ్రీ, శ్రీనివాసునాయుడు, కేఎంఆర్ నారాయణరావు, రఘురామనాయుడు, ఉషారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్ఞాపికలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ

30న మోడల్ పరీక్ష

విజయనగరం గంటస్తంభం: స్థానిక గురజాడ గ్రంథాలయం కేంద్రంగా ఈ నెల 30న డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించనున్నామని డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ హరీష్ తెలిపారు. బుధవారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమే పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ప్రశ్నపత్రాన్ని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8019273486, 7095956895 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు సతీష్ ఉన్నారు.

యోగాపై వ్యాసరచన పోటీలు

విజయనగరం: విద్యార్థి దశ నుంచే యోగా పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా అన్ని సచివాలయాలలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో చేపట్టిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్ర 2025 కార్యక్రమంలో ప్రభుత్వం అనేక అంశాలను పొందుపరిచిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు యోగాపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చిన్నతనం నుంచి యోగాసనాలు అభ్యసనం చేయడం ద్వారా చురుకుదనంతో పాటు, మేధోశక్తి పెరిగే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు ఈ దిశగా పిల్లలను యోగా పట్ల చైతన్యవంతులను చేయాలని కోరారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లో పుస్తకాల విక్రయంపై ఆందోళన


నారాయణ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

విజయనగరం గంటస్తంభం: పుస్తకాల విక్రయానికి, అధిక ఫీజులు వసూళ్లకు వ్యతిరేకంగా బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణ స్కూల్ వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం పాఠశాలలో పుస్తకాలు విక్రయించడంగాని, పుస్తకాలపైన పాఠశాలల పేర్లు ప్రింట్ చేయడంగానీ జరగకూడదని చెబుతున్నా నారాయణ పాఠశాలలో విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా పుస్తకాల దగ్గర నుంచి యూనిఫాంల వరకు వ్యాపారం జరుగుతుందన్నారు. మరోవైపు విద్యార్థుల దగ్గర నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం కాకపోయినా ముందుగానే పుస్తకాలు అమ్ముతున్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా, జిల్లాలో ఉన్న అధికార యంత్రాంగం చూసీచూసినట్టు విడిచి పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వి.చిన్నబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సోమేష్, ఆర్.శిరీష్, పట్టణ అధ్యక్షుడు సూరిబాబు, గౌరీ, గుణ, లక్ష్మి పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టీవీ రమణ


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టీవీ రమణ

గజపతినగరం: ఉగ్రవాదాన్ని అంతమొందించాల్సిన బాధ్యత భారతీయులందరిపైనా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టీవీ రమణ అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమైక్యతా యాత్రలో ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ దాడిని అందరూ ఖండించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం వీరోచితంగా పోరాడిందని కొనియాడారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలూ, సంస్థలు బాసటగా నిలిచాయన్నారు. అయితే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజల ప్రాణాలకు, సైనికుల త్యాగాలకు విలువ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకుని దేశ సమగ్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ కుట్రలకు రాష్ట్ర కూటమి నాయకులు సహకరించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, జిల్లా నాయకులు రాములు, హరికృష్ణ, వేణి, సోములు, అప్పలనరసయ్య, టి.రాము, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నేడు ‘జిందాల్’ నిర్వాసితులతో సమావేశం

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ కోసం వేల ఎకరాల భూములిచ్చి కూలీలుగా మారిన నిర్వాసిత రైతుల సమస్యలపై కార్యాచరణ రూపొందించడానికి గురువారం ఉదయం 10 గంటలకు బొడ్డవర గ్రామంలోని సాయిభవానీ కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ రఘురాజు ప్రకటించారు. ఈ మేరకు ఆయన భవానీనగర్‌లోని గ్రామైక్య సంఘ భవనంలో పలువురు నిర్వాసితులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా రఘురాజు మాట్లాడుతూ.. జిందాల్ పరిశ్రమ కోసం వేల ఎకరాల భూములిచ్చి 18 ఏళ్లు గడుస్తున్నా జిందాల్ యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిర్వాసితులకు సత్వర న్యాయం అందేలా ఉద్యమించడం కోసం సీపీఐ, సీపీఎంలతో కలిసి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.


జిందాల్ నిర్వాసితులతో ఎమ్మెల్సీ రఘురాజు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

- వ్యవసాయ శాఖ ఏడీఏ మహారాజన్

గజపతినగరం: భూమిని కౌలుకు చేస్తున్న ప్రతి రైతుకీ కౌలురైతు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని వ్యవసాయశాఖ గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్ అన్నారు. మండలంలోని పాతబగ్గాం రైతుసేవా కేంద్రంలో 'కౌలు రైతులకు పంట సాగుదారుని హక్కుపత్రం' అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరైతే పంట మీద వచ్చే ప్రతి హక్కును పొందవచ్చన్నారు. పంట మీద రుణం, దిగుబడి విక్రయించడం, ప్రకృతి వైపరిత్యాల వల్ల కలిగే నష్టాలకు పరిహారం పొందడం వంటి లాభాలు కలుగుతాయని చెప్పారు. అదేవిధంగా భూమి యజమానికి ఎటువంటి నష్టం కలగకుండా కౌలు చట్టం చేయబడిందన్నారు. కౌలు కార్డులు కేవలం 11 నెలలు మాత్రమే పని చేస్తుందని.. కేవలం పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని ఏడీఏ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ధనలక్ష్మి, గ్రామ రెవెన్యూ అధికారి అప్పలనాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రవీణ్, సర్పంచ్ లెంక పద్మావతి, గ్రామ పెద్దలు లెంక చిన్నంనాయుడు, పప్పల గురినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


కౌలు రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ మహరాజన్

దివ్యాంగుల గుర్తింపు సర్వే

గంట్యాడ: దివ్యాంగ చిన్నారులను గుర్తించడానికి సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈఓ విజయకుమారి తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వాళ్లను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని నరవ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

60 మందికి నేత్ర పరీక్షలు


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామ సచివాలయం వద్ద వైజాగ్ శంకర్ ఫౌండేషన్ వైద్యులు బుధవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించింది. 60 మందిని పరీక్షించి 23 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు క్యాంప్ సూపర్‌వైజర్ జోగారావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్ద శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.